53

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (తణుకులో శ్రీనాన్నగారి ప్రవచనము, 25-7-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అన్ని సాంప్రదాయాలవారు వస్తున్నారు, చెపుతున్నారు మా మనస్సు ఎక్కడ నిలబెట్టాలో తెలియటంలేదు. వైష్ణవులు, శైవులు ఇలా అందరూ వచ్చి వారి వారి పద్ధతులలో చెపుతున్నారు. మేము ఎటు ప్రయాణం చేయాలో మాకు అర్ధంకావటంలేదు, ఎలా అభివృద్ధిఅవ్వాలో మాకు తెలియటంలేదు అని ప్రశ్నిస్తున్నారు. అసలు సమస్య ఎక్కడ వస్తోంది అంటే భగవంతునికి నామంలేదు, రూపంలేదు. రూపాలు, నామాలు మనం కల్పించుకొంటున్నాము. పరతత్వానికి రూపంలేదు, నామంలేదు, గుణంలేదు. మనకు రూపబుద్ధి ఉంది. మనబుద్ధి దేవునిమీదకూడా ఆరోపిస్తున్నాము. ఉన్నవస్తువు ఒక్కటే. దానికి కొంతమంది దేవీరూపం కల్పించారు, కొంతమంది విష్ణురూపం కల్పించారు, కొంతమంది శివరూపం కల్పించారు. రూపాలు, నామాలు ఎందుకు వచ్చినవి అంటే ఉపాసనకోసం ఏర్పడ్డాయి.

అందరి హృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను, చైతన్యముగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. ఇది అర్ధంచేసుకోవటం చాలాకష్టం. ఎందుకంటే దానికి రూపంలేదు, నామంలేదు. మన కంట్రోలర్ ఎక్కడో దూరాన లేడు, మన హృదయంలోనే ఉన్నాడు. మన హృదయంలోనే ఉండిన ప్రారబ్దమునకనుసరించి దేహాన్ని, జీవుడిని నియమిస్తున్నాడు. పేచీలుఅన్నీ రూపబుద్ధినుండి వస్తున్నాయి. నిజం ఎప్పుడూ ఒకటిగా ఉంటుందిగాని రెండుగా ఉండదు, మూడుగా ఉండదు. ఒకటి నిజం, రెండు మాయ. అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను, చైతన్యముగా ఉన్నాను అని చెప్పిన ఆ భగవంతుడే కొంచెం క్రిందకు దిగిపోయి తరువాత రాముడిని నేను, కృష్ణుడిని నేను, కుమారస్వామిని నేను అని ఎందుకు చెప్పాడుఅంటే మనఅందరికీ అర్ధమవ్వటంకోసం, ఉపాసనకోసం చెప్పాడు.

ఆకారములేని దేవునికి ఒక ఆకారం కల్పించటంలో పొరపాటు ఏమీ లేదు. రూపం, నామం లేనిదానిని మనం పట్టుకోలేము. మనకు రూపబుద్ధి ఉంది. అందువలన ఒకరూపం కల్పించి, ఒకనామం కల్పించి మనం ఆరాధన చేస్తున్నాము. పూజ, ఉపాసన, అర్చన, జపం చేసుకోవటానికి మన హిందూమతంలో భగవంతునికి అనేక నామాలు, రూపాలు కల్పించారు. ఈ రహస్యం భగవంతునికి తెలుసు. అందుచేత ఎవరు ఏరూపాన్ని, ఏనామాన్ని ఆరాధించినప్పటికీ నన్నే పొందుతారు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. అంటే కృష్ణుడిని పొందుతారు అనికాదు ఆయన హృదయాన్ని, ఆయన స్వరూపాన్ని పొందుతారు. ఆయన స్వరూపంఅంటే చైతన్యమును పొందుతారు అంటే మోక్షస్థితిని పొందుతారు. గొడవలు ఎందుకు వస్తున్నాయిఅంటే రూపబుద్ధి ఉన్నవాడు తత్వాన్ని తెలుసుకోలేడు. రూపబుద్ధి ఉన్నవాడు వాడు ఏరూపాన్ని ఆరాధిస్తున్నాడో ఆరూపం మిగతా రూపాలకంటే గొప్పది అనుకొంటాడు. మతంపేరుమీద మనకు గొడవలు రావటానికి ఇదే కారణం. మనం సమన్వయంచేసుకోవాలి. అందుచేత భక్తులందరికి నావిజ్ఞప్తి ఏమిటి అంటే ఇక్కడ ఎవరు ఏవిషయంగురించి మాట్లాడుతున్నప్పటికీ మీకుగనుక Subjectను సమన్వయం చేసుకొనే శక్తి లేకపోతే కన్‌ఫ్యూజన్ (Confusion) వస్తుంది. ఎవరు వచ్చికూర్చొని ఏవిషయంగురించి మాట్లాడినా, మీరు సమన్వయం చేసుకోండి. మన హృదయంలో ఒక సత్యంఉంది. మీరు

ఏరూపాన్ని, ఏ నామాన్ని ఆరాధించినా ఇప్పుడు మీకు దేహం ఏవిధంగా అయితే అనుభవంలో ఉందో అలాగ మీహృదయంలోఉన్న సత్యం అనుభవంలోనికి వచ్చేవరకూ మీకు స్వేచ్ఛలేదు, ఆనందము లేదు. మనం రూపాలు, నామాలు కల్పించుకోవటంలో పొరపాటులేదుగాని అదే తత్వంకాదు.

ఉన్నది ఒకటే వస్తువుఅని తత్వం తెలిసాక మనకు తెలుస్తుంది. ఈలోపల మనకు పోరాటంవస్తూ ఉంటుంది. ఉన్నవస్తువు ఉన్నట్లుగ మనకు తెలిసేవరకూ బేధబుద్ధి వెంటాడుతుంది. దేవుని ఆరాధన, సత్పురుషుల సహవాసం ఇవిఅన్నీ ఎందుకుఅంటే మనస్సును పవిత్రం చేయటంకోసం. మనస్సుకు నెమ్మదికలగాలి, శాంతి కలగాలి. ఈశ్వరుని ఆరాధించటంవలన మనస్సుకు నిర్మలమైన స్థితి కలుగుతుంది. మనకి పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనస్సులో నిర్మలత్వం పోగొట్టుకోకుండా ఉంటే అన్ని దుఃఖాలు నశిస్తాయి. మనస్సు నిర్మలత్వంగా ఉంటే దుఃఖం ఎంతవేగముగా దూసుకొంటూ వస్తున్నప్పటికీ అది ఆరిపోతుంది. మన మనస్సులో ఉన్న దోషములతో పోరాడాలంటే ఎంతోకొంత శాంతి, నిర్మలత్వం ఉండాలి. రూపబుద్ధి పెట్టుకోనక్కరలేదు. ఎవరికి ఇష్టమైన రూపమును వారు ఆరాధించుకొంటారు. వారు ఆరూపమును ఆరాధించుకొంటున్నారు అని వాటిగురించి ఆలోచిస్తూ కాలమును, శక్తిని వృధాచేసుకోవద్దు. దేవుడిని ఆరాధిస్తున్నాముఅంటే అది గమ్యంకాదు. అది ఒక సాధనము (means) మాత్రమే. మనగమ్యం వేరుగా ఉంది. విష్ణువు ఎక్కువఅని కొంతమంది, శివుడు ఎక్కువఅని కొంతమంది అంటూ ఉంటారు. తత్వం తెలియకపోవటంవలన వచ్చేవిషయం ఇది. రూపబుద్ధి ఉన్నంతకాలం మనం ఈగెడపను దాటలేము. తత్వం తెలిస్తే ఈబాధలు ఉండవు. విష్ణువు అని చెప్పినా, శివుడు అని చెప్పినా ఒకే తత్వానికి వర్తిస్తాయి. ఇద్దరూ వేరు కాదు. సత్యం అనేది ఒకటిగానే ఉంటుంది. రెండు అనేది మాయ.

మనస్సు ఇంద్రియాలద్వారా బాహ్యముఖానికి వచ్చేస్తూ ఉంటుంది. మన మనస్సు మనం చెప్పినమాట వింటూఉంటే మనం సుఖపడతాము. మన మనస్సు మనం చెప్పినమాట వినకపోతే మనం దుఃఖపడతాము. అందువలన నీ మనస్సును విరోధిగా చేసుకోవద్దు, నీ మనస్సును నీ స్నేహితునిగా చేసుకోఅని భగవంతుడు చెప్పాడు. మనం ఎక్కువగా నేను, నేను, నాది, నాది అంటూఉంటాము. బ్రహ్మానుభవం కలిగేవరకూ జనరల్‌గా ప్రతిమనిషిని పీడించేవి ఈరెండే నేను-నాది. మీచేతిలో ఏదైనా వస్తువు ఉంది అనుకోండి ఆవస్తువుమీద నాకు అంత ప్రీతి ఉండదు. ఆవస్తువు నాకు ఇస్తే ఆవస్తువుమీద నాకు ప్రీతి కలుగుతుంది ఎందుకంటే నాది. ఆవస్తువు నాది అయిన తరువాత ప్రీతి కలుగుతుంది ప్రీతి ఎక్కడనుండి వస్తోందిఅంటే వస్తువులోనుండి రావడంలేదు నాదిలోనుండి వస్తోంది. దుఃఖంకూడా అంతే. మీజేబులో పర్సుపోతే నాకు ఎర్రచీమకుట్టినట్లుకూడా ఉండదు. నాదగ్గర పర్సుపోతేమటుకు దుఃఖం వస్తుంది ఎందుచేతనంటే నాది. నాదిలోనుండే ప్రీతివస్తోంది, నాదిలోనుండే దుఃఖం వస్తోంది. నాది ఎక్కడనుండి వస్తోంది. నేనులోనుండి వస్తోంది. నేనులేకపోతే నాదిలేదు. ఈనేనుఅనేది ఒక తలంపు. ఈనేనుకు ఇతర తలంపులు వస్తున్నాయి. నాకు కోపంవచ్చింది, నాకు కష్టం వచ్చింది అంటాము. ఇవి అన్నీ నేనుకు వస్తున్నాయి. ఈనేను అనేది ఒక సమస్య. ఈనేనుఅనే సమస్యను పరిష్కారం చేయటమే ఇండియన్ ఫిలాసఫీయొక్క లక్ష్యం. నీకు అనేక సమస్యలు వస్తున్నాయి ఈసమస్యలు ఎందుకు వస్తున్నాయి, ఎక్కడనుండి వస్తున్నాయి అని ఆలోచించిచూస్తే ఈనేనే వాటికి ఆధారమవుతుంది. అందుచేత రమణమహర్షి ఏమనిచెప్పారుఅంటే నేనుఉంటే అంతా ఉంది, ఇది లేకపోతే ఏదీలేదు అన్నారు. నేనుఉంటే వైకుంఠము ఉంది, కైలాసము ఉంది, పుణ్యం ఉంది, పాపం ఉంది, ధర్మం ఉంది, అధర్మం ఉంది, మరణానంతరజీవితం ఉంది, జగత్తు ఉంది, జీవుడు ఉన్నాడు, దేవుడు ఉన్నాడు. నేను లేకపోతే ఏదీ లేదు.

ఇటు **enjoyment** వైపుకు ప్రయాణం చేయాలన్నా, అటు **perfection**వైపుకు ప్రయాణం చేయాలన్నా

మన చేతులలో ఉంది. ఇప్పుడు మనం జంక్షన్‌లో ఉన్నాము. మన మనస్సు బాహ్యాముఖానికి వెళుతూ ఉంటే అంటే విషయాలలోనికి వెళుతూఉంటే అదే అహంభావనక్రింద మారుతుంది. ఆమనస్సునే నీవు ఉపసంహరించి, ఉపసంహరించి లోపలకు పంపితే అది ఆత్మాకారం చెందుతుంది. ఇటు పంపితే **enjoyment**, అటు పంపితే **perfection**. విషం ఎక్కడ ఉంది అంటే విషయాలలో ఉంది అని ఆచార్యులవారు చెప్పారు. నిరంతము బాహ్య విషయాలను స్మరిస్తూఉంటే మనిషి కూడా నీడ ఏవిధంగా వస్తుందో అలాగ మనలను దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. బుద్ధిమంతులు చేయవలసినపని ఏమిటిఅంటే మనస్సు బాహ్యాముఖానికి విజృంభిస్తూఉంటుంది కదా ఆ మనోవేగాన్ని తగ్గించాలి. ఇది మనం వెంటనే చేయవలసిన పని. మనస్సు మనస్వాధీనంలో ఉంటే మనం ధర్మంచేస్తాము, మనస్సు మన స్వాధీనంలో లేకపోతే అధర్మంచేస్తాము. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. అధర్మంగా ఉండవద్దు, ధర్మాన్ని ఆచరించు అని చెపుతున్నారు. ధర్మాన్ని ఎందుకు ఆచరించాలి? మనం ఎవరిమో మనకు తెలిసేవరకూ మనంకాని వస్తువులమీద అపేక్ష కలుగుతూ ఉంటుంది. ఇది ప్రకృతి రహస్యం. ప్రకృతిలో ఏవస్తువును చూసినా మనకు అపేక్ష కలుగుతుంది. నువ్వు ఎవరో నువ్వు తెలుసుకోవటానికి ధర్మం సహకరిస్తుంది. అందువలన ధర్మాన్ని ఆచరించాలి. నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ అధర్మం దానికి అవరోధంగా ఉంటుంది. అందువలన అధర్మంగా ఉండవద్దు. నీవు ఎవరో నీకు తెలియకపోతే దేవుడుకూడా తెలియడు. నాకు రాముడు, కృష్ణుడు కనిపించాడు అంటారు అవి కేవలము మానసిక దృశ్యములు మాత్రమే. అది వ్యవహారిక సత్యంకాని పారమార్థిక సత్యం కానేకాదు.

నేనుఅనే తలంపు ఎక్కడనుండి పుట్టివస్తోందో అదే హృదయం. అక్కడే దేవుడు ఉన్నాడు. అది ఫిజికల్ హార్ట్ కాదు, స్పిరిట్యువల్‌హార్ట్ స్పిరిట్యువల్‌హార్ట్ ఎదురురొమ్ముకు కుడివైపున ఉంది అని భగవాన్ చెప్పారు. మనసంకల్పాలు, ఊహలు అన్నీ అక్కడ ఉంటాయి. మనకి ఎవరిమీదఅయినా అసూయ కలిగింది అనుకోండి. దీనిని భగవంతుడు ఎక్కడో జాగ్రత్త పెట్టడు. నీ స్పిరిట్యువల్ హార్ట్‌లోనే జాగ్రత్త పెడతాడు. అసూయపడ్డాము అన్నసంగతి 4రోజుల తరువాత మనం మర్చిపోవచ్చు. కాని పరమలోభివాడు తన డబ్బును ఎలా జాగ్రత్తపెట్టుకొంటాడో అలాగ మనలోపల ఉన్న కంట్రోలర్ మనకివచ్చే తలంపులను ఆయన జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. ఏదో జన్మలో మనం వాటికి సమాధానం చెప్పాలి. నేను, నేను అని ప్రతీ మనిషి అంటాడు. అది నిజంకాదు. అది ఒక తలంపు. గాఢనిద్రలో తలంపులు అణిగిపోయినపుడు ఇదికూడా అణిగిపోతుంది. గాఢనిద్రలో మీకు ఏగొడవ లేదు కాని అక్కడ మీరు ఉన్నారు. ఎలాగ ఉన్నారు అంటే ఆత్మగా ఉన్నారు, చైతన్యంగా ఉన్నారు. గాఢనిద్రలోనుండి మెలుకువలోనికి రాగానే ముందు నేనుఅనే తలంపు వస్తుంది. నేను అనే తలంపు వచ్చాక మిగతా తలంపులు వస్తాయి. ఇది రాకముందు ఏమీలేదు. ఈనేనుఅనే తలంపు ఎక్కడనుండి పుట్టివస్తోందో అంటే నేనుయొక్క మూలమును అదిచూస్తే అక్కడ అది అణిగిపోతుంది. నీకు నేనుఅనే తలంపు వస్తోంది. దానిమూలం నీలోపలే ఉంది. కాని అది నీదేహంలో ఒకభాగం కాదు. నీదేహానికి దానికి ఇసుమంతయూ సంబంధంలేదు. నీదేహానికి దానికి సంబంధం ఉంటే దేహాన్ని కాల్చినపుడు అదికూడా కాలిపోతుంది. నీదేహానికి దానికి ఎట్టి సంబంధంలేదు. నేను అనే తలంపుయొక్క మూలం నీకు తెలిస్తే నీవు ఎవడివో నీకు తెలుస్తుంది. నీవు ఎవడివో నీవు తెలుసుకొన్నప్పుడు నీవు పోవు. నీ నిజస్వరూపం నీకు తెలుస్తుంది. దేహగతమైన నేను నశించి నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది.

పూజ, జపం, ధ్యానం ఇవిఅన్నీ మనస్సును పవిత్రంచేయటంకోసం. మీరు ఏదో భగవంతుని నామం తీసుకొని జపంచేస్తారుకదా. మీరు ఏదైతే నామంచేస్తున్నారో ఆ నామము, ప్రాణము, మనస్సు ఒకటి అయిపోవాలి. అప్పుడు మీరు అనుకొన్న ఫలితం వస్తుంది. మీరు సాధన బాగాచేస్తున్నప్పుడు సిద్ధులు రావచ్చును. అక్కడ

ఆగిపోకూడదు. నేనుయొక్క మూలం తెలిసేవరకూ మీప్రయాణం ఆగకూడదు. సాధనచేయటంవలన సిద్ధులు రావచ్చును. ఆసిద్ధులు అన్నీ ఎవరివి? అన్నీ దేవుడివి. దీనికి రామకృష్ణుడు ఇలా చెప్పాడు. గ్రామస్థుల బట్టలుఅన్నీ చాకలివాడి ఇంట్లో ఉంటాయి. ఆబట్టలుఅన్నీ నావిఅని చాకలివాడు అనుకోవటం ఎలా ఉంటుందో సిద్ధులు ప్రదర్శించేవాడు ఈసిద్ధులు అన్నీ నావి అని అనుకోవటం అటువంటిదే అనిచెప్పాడు. సిద్ధులుఅన్నీ వీడివా? వీడివి కాదు. అవి అన్నీ భగవంతుడివే. దీనికి భగవాన్ ఇలాచెప్పారు నీవు భగవంతుని స్వరూపమును పొందినపుడు నీకు సిద్ధులు గొడవఎందుకు. నీవు దేవుని స్వరూపమును పొందినపుడు నీకు కర్తృత్వం నశిస్తుంది. ఎవడికైతే కర్తృత్వం నశించిందో వాడికి అనుభవించటానికి కర్మ మిగలదు.

కొంతమందికి అకారణంగా కోపం వస్తుంది. వారు తిట్టినారు, వారు అలాగ అన్నారు అని జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటారు. కోపం ఎక్కువ ఉన్నమనిషి భూతకాలంలో బ్రతుకుతాడు. ఆశఉన్నవాడు ఈసంవత్సరం ఇంతలాభం వస్తుంది, పై సంవత్సరంఅంత లాభం వస్తుంది అని భవిష్యత్‌కాలంలో బ్రతుకుతాడు. కామంఎక్కువ ఉన్న మనిషికి భూతకాలం, భవిష్యత్‌కాలం అక్కరలేదు, వర్తమానకాలంలో బ్రతుకుతాడు. ఎవరో చెప్పారని నమ్మవద్దు ఇవి మన అనుభవంలో తెలుస్తాయి. ఆచార్యులవారు ఏమంటున్నారుఅంటే నీముక్కులోగాలిని తరువాత చూసుకోవచ్చును అది తిరుగుతూనే ఉంటుంది. ముందు నీబుద్దిని అభివృద్ధిచేసుకో. నీకు వివేకం కావాలి, విచక్షణ కావాలి. ఇది ఆత్మ ఇది అనాత్మ, ఇది ధర్మం ఇది అధర్మం, ఇది మంచి ఇది చెడ్డ అనే విచక్షణను అభివృద్దిచేసుకో. చేతిలోఉన్న కాలాన్ని ఉపయోగించుకొని నీబుద్దిని అభివృద్ధి చేసుకో. నీదేహం ఉండగా సంపాదించలేనిది దేహం మరణించిన తరువాత నీవు సాధించలేవు. దేహం ఉండగా మోక్షస్థితిని సాధించకపోతే నీకు రాకపోకలు తప్పదు.

రామకృష్ణుడు, రమణమహర్షి వీరు ఇద్దరు ఎక్కువ చదువుకోలేదు. పెద్ద పండితులు కాదు. శబ్దాడంబరము వీరిలో ఏమీ ఉండదు, చాలా సింపుల్‌గా చెపుతారు. మనకు ఆత్మానుభవం కలగటంకోసం, చైతన్యస్థాయి పెరగటంకోసం చాలా అద్భుతమైన టీచింగ్ చేశారు. మనం వీరికి చాలా ఋణపడి ఉన్నాము. మనం అందరం ఇక్కడ ఉన్నాము. ఉన్నామన్న సంగతి మనకి తెలియటానికి కఠోపనిషత్ ఏమీ చదవనక్కరలేదు. కాని సుఖంగా, శాంతిగా లేము. మనం జాగ్రదావస్థలో ఇక్కడ ఉన్నాముకాని సుఖంగా, శాంతిగా లేము. కాని గాఢనిద్రలో సుఖంగా, శాంతిగా ఉన్నాము కాని ఉన్నాముఅన్న సంగతి మనకు తెలియటంలేదు. జాగ్రదావస్థలో ఉన్నాము అనితెలుస్తోందిగాని సుఖంగా, శాంతిగా లేము. గాఢనిద్రలో ఉన్న సుఖము, జాగ్రదావస్థలో ఉన్న ఎరుక రెండూ ఒకేసారి అనుభవంలోనికి వస్తే అదే మోక్షం. స్వప్నదేహాలు ఎటువంటివో జాగ్రదావస్థలో కనబడే దేహాలుకూడా అటువంటివే. స్వప్నంలో ఈదేహం ఇక్కడే ఉంటుంది. మనస్సు ఇంకో దేహాన్ని క్రియేట్ చేస్తుంది. అది సినిమాలకు వెళుతుంది, అంతా తిరిగి వస్తుంది. మెలుకువ వచ్చాక మనస్సు క్రియేట్ చేసిన దేహం కనబడదు. దానిగురించి పోలీస్ స్టేషన్‌లో ఎందుకు పిర్యాదు చేయటంలేదు. ఎందుచేతనంటే మెలుకువ రాగానే ఆదేహం నిజంకాదు అని మనకు తెలుస్తోంది. ఈస్వప్న దేహాలు ఎంతనిజమో జాగ్రదావస్థలో కనబడే దేహాలుకూడా అంతే నిజం అని బ్రహ్మానుభవం పొందినవాడికి తెలుస్తుంది.

బాహ్యావిషయములను ఎక్కువ చింతించవద్దు. మనం ఏదైనా పనిచేసుకొనేటప్పుడు మనస్సు బాగానే ఉంటుంది. విరామ సమయం వచ్చినపుడు విషయ చింతనకు వెళ్ళిపోతుంది. విరామసమయంలో మనస్సు ఎక్కువ పొల్యూట్ అవుతుంది. అందువలన విరామ సమయంలో భగవంతుని చింతించు. ఈశ్వరుని చింతించటంవలన మనస్సు పవిత్రం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అవ్వాలంటే ఏకాగ్రత, పవిత్రత అవసరము. నీకు అల్లోపతికంటే, హోమియోపతికంటే మానసిక ఆరోగ్యం బాగుపడటానికి నామోపతి మంచిది అని స్వామి శివానంద చెప్పేవారు.

మీకు ఇష్టమైన భగవంతుని నామమును మననం చేస్తూఉంటే నీమనస్సు పవిత్రం అవుతుంది. నీ మనస్సుకు శాంతి కలుగుతుంది, ఏకాగ్రత కలుగుతుంది. నామోపతి ఖర్చులేని పని. పైసా ఖర్చులేదు కాని అందరూ దీనిని తేలికగా చూస్తారు ఎందుచేతనంటే డబ్బు ఖర్చుఅయ్యేపని అంటే అందరికీ సంతోషం. మీకు ఇష్టమైన భగవంతుని నామమును తీసుకొని నిరంతరము చింతించటంవలన ఆయన అనుగ్రహానికి పాత్రులవుతారు. మనం చేసేది కృషి, ఆయన ఇచ్చేది కృప. చింతించటం అనేది నీవైపునుండి నీవు చేసే కృషి. మనం ఏమి చేస్తాము అంటే మనం చేసే కృషి మానివేసి ఆయన కృపకోసం ఎదురుచూస్తాము. నీవు చేయవలసిన పనిని నీవు చెయ్యి. నేను చేసేపని ఎప్పుడు చేయాలో, ఎక్కడ చేయాలో, ఎలా చేయాలో నాకు తెలుసు. దానికోసం ఎదురుచూడవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడు అంటే సర్వజ్ఞుడు. ఆయనకు తెలియనిదంటూ ఏదీ లేదు.

ప్రపంచంఅంటే ఏమిటి? రూపము, నామము, క్రియ. ఈ మూడింటిని తీసిచూస్తే ప్రపంచం ఏమీలేదు. (ఈప్రపంచం ఎన్ని యుగాలనుండో ఉంటోంది. ఇప్పటివరకు నేను ఉన్నాను అని ఈ ప్రపంచం ఎవరితోనైనా చెప్పిందా? లేదు. కాని ప్రపంచం ఉంది అని నేను చెపుతున్నాను. గాఢనిద్రలో ప్రపంచం గొడవ ఉండదు, దేహం గొడవ ఉండదు. గాఢనిద్రలో దేహంనుండి విడిపోతున్నావు. నువ్వే కనుక దేహం అయితే గాఢనిద్రలోకూడా దానికి సంబంధించిన స్మృతిలోనుండి నువ్వు వేరుపడటానికి అవకాశం లేదు. దేహమే కనుక నీవు అయితే నాకు ఒకదేహం ఉంది అనే స్మృతి నీకు గాఢనిద్రలోకూడా ఉండాలి. కాని నీకు గాఢనిద్రలో దేహం గొడవలేదు. దేహం ఉంటే లోకం, దేహం లేకపోతే లోకం ఏమిటి? మనస్సు ఉంటే దేహం, మనస్సు లేనివాడికి దేహం లేదు. ఈమనస్సును విచారణ చెయ్యి. మనస్సునే జీవుడు, జీవుడు అంటున్నాము. వాడు ఎవడో విచారణ చెయ్యి. వాడు ఎవడో తెలిస్తే నీవు దేవుడు అవుతావు. నీ మనస్సు, దేహము, ప్రపంచము ఇవి అన్నీ నీడలే. ఈనీడలను చూసి ఎందుకు కంగారు పడతావు అన్నారు భగవాన్.) Never

ఈప్రపంచంలో సత్యం ఎవరికీ అక్కరలేదు అని ఐన్‌స్టీన్ చెప్పాడు. ఎందుచేతనంటే దానివిలువ ఎవరికీ తెలియటంలేదు. డబ్బు విలువ తెలుస్తోంది కాబట్టి దానిని సంపాదించుకొంటున్నారు. సత్యం విలువ తెలియక దానిని ఎవరూ సంపాదించుకోవటంలేదు. అందువలన ఎవరైనా సత్యాన్వేషకులు కాకపోతే వారిని తిట్టవద్దు, వారిని విమర్శించవద్దు. సత్యంయొక్క విలువ వారికి చెప్పండి. సత్యంయొక్క విలువ వారికి తెలిస్తే అప్పుడు సత్యాన్ని సంపాదించటానికి వారు ప్రయత్నంచేస్తారు అని చెప్పాడు. బాహ్యవిషయాలను ఎక్కువగా చింతిస్తూఉంటే నీ మనస్సు పాడవుతుంది. నీకు నువ్వు దూరమయిపోతావు, అంటే నీస్వరూపానికి దూరమవుతావు. ప్రకృతికి దగ్గరవుతావు. ఏదేవుని ఆరాధించినప్పటికీ నీవు ప్రకృతిగుణాలను దాటివెళ్ళితేగాని మోక్షస్థితిని పొందలేవు.

మోక్షం సంపాదించటానికి కావలసిన ముఖ్యమైన సామగ్రిలో భక్తి ఒకటి. తల్లి లేకుండా బిడ్డ రాదు అనేవారు భగవాన్ దాని అర్థం ఏమిటి అంటే భక్తి లేకుండా జ్ఞానం రాదు. సత్యం నీ హృదయంలో ఉంది. దానికోసం నిరంతరము అన్వేషణ చెయ్యి. మనస్సుకు యోగ్యత లేకపోతే, అర్హత లేకపోతే దానిని అన్వేషణ చేయలేదు. సత్పురుషుల సహవాసంవలన, ఈశ్వరుని ఆరాధించటంవలన నీ మనస్సుకు ఏకాగ్రత, పవిత్రత కలుగుతుంది. అప్పుడు నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అయ్యేకొలది అది హృదయగుహలో ఎక్కువకాలం ఉండగలదు. నీ మనస్సు మెదడులో ఉండటానికి సాధనచేస్తున్నారా చేయటంలేదు. మన ప్రయత్నం లేకుండానే మన మనస్సు మెదడులో ఉంటోంది. నీమనస్సు నీ మెదడులో ఎంత అప్రయత్నంగా ఉందో అంత అప్రయత్నంగా, అంత నేచురల్‌గా హృదయంలో ఉంటే ఈదేహం ఉండగానే, ఇప్పుడే, ఈలోకంలో ఉండగానే నీకు రియలైజేషన్ వస్తుంది. అంటే మోక్షస్థితిని పొందుతావు.

నాలో ఏదైనా పవిత్రత ఉంటే మీలోఉన్న పవిత్రత నాకు కనబడుతుంది. నాలో ఏమీ పవిత్రత లేదు

అనుకోండి నిజంగా మీరు పవిత్రులు అయినప్పటికీ మీలో ఉన్న పవిత్రత నాకు కనబడదు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. యోగ్యత, అర్హత లేనపుడు కళ్ళు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు అనేవారు భగవాన్. మీ మనస్సును కంట్రోలుచేసుకోలేకపోతున్నారు అనుకోండి మహాత్ముల సన్నిధిలో కూర్చొంటే మీప్రయత్నం ఏమీలేకుండానే మీమనస్సు నెమ్మదిగా శాంతిలోనికి కూరుకొనిపోతుంది. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. దానిని మాటలతో వర్ణించలేము. మహాత్ములసన్నిధిలో మీకు తెలియకుండానే మనస్సు బాహ్యంగా విజృంభించటం ఆగిపోతుంది, మనస్సు తన మూలంలోనికి ప్రయాణం చేస్తుంది.

నీలోపల దుఃఖం ఎంతకాలం అయితే ఉందో అంతకాలం దేహాలు వస్తూనే ఉంటాయి. నీలోపల ఉన్న దుఃఖం అంతా బయటకు వచ్చేస్తే నీకు మోక్షం. ఈదేహం నాది అని దేహంలోపల ఉండి ఎవడైతే చెపుతున్నాడో దేహం చనిపోయినపుడు వాడే ఏడుస్తాడు. బ్రతికున్నవారికంటే చనిపోయినవారు అదృష్టవంతులు అన్నారు భగవాన్. చనిపోయినవారు బ్రతికున్నవారిగురించి తొందరగా మర్చిపోతారు. కాని బ్రతికున్నవారు చనిపోయినవారిగురించి తలపెట్టుకొని, తలపెట్టుకొని ఏడుస్తూ ఉంటారు. 70,80 ఏండ్లు ఈదేహంలో ఉంటాముకదా చనిపోయిన తరువాత ఆదేహం కోసం వెతుక్కొంటాము. 10,15 రోజులు వెతుక్కొన్న తరువాత ఆదేహం పోయింది అనుకొంటాము. ఆదేహం గొడవ వదిలివేస్తాము. ఆదేహం గొడవ ఎప్పుడైతే వదిలివేసామో ఆదేహానికి సంబంధించిన చుట్టాలు, స్నేహితుల గొడవ అంతా మరపు వచ్చేస్తుంది. అందువలన చనిపోయినవారు అందరూ అదృష్టవంతులే. వారు తొందరగా మర్చిపోతున్నారు. కాని చనిపోయినవారిగురించి బ్రతికున్నవారు ఏడుస్తున్నారు. చనిపోయినవారి గురించి ఏడవకండి. చనిపోయినవారిగురించి మీలో ఎవడైతే ఏడుస్తున్నాడో వాడికి ఇంకా చావు రాలేదు అని ఏడవండి.

అహంభావనకు రూపంలేదు. ఏదోరూపమును పట్టుకొని ఉంటుంది. పునర్జన్మ ఎందుకు వస్తుంది అంటే అహంభావన రూపం లేకుండా ఉండలేదు. అహంభావన ఉంది అని చెపుతున్నారు. అహంభావన వలననే అన్ని కష్టాలు వస్తున్నాయి దానిని పోగొట్టుకోమని చెపుతున్నారు. అహంభావనను ఎలా పోగొట్టుకోవాలి అని ప్రశ్న. నీ దేహానికి food supply cut చేస్తే అది చనిపోతుంది అలాగే నీఅహంభావనకు food supply cut చెయ్యి దాని అంతట అదే గాలిపోతుంది. అహంభావనకు రూప చింతన, నామచింతన ఆహారము. మన దేహానికి food supply cut చేసాము అనుకోండి. కొన్ని రోజులకు దేహం చనిపోతుంది. ఎందుచేతనంటే ఈదేహము foodను బట్టి తయారవుతోంది. అలాగే నీ అహంభావనకు food supply cut చెయ్యి అది చనిపోతుంది. నీవు పూజచేస్తావో, జపం చేస్తావో, ధ్యానం చేస్తావో నీపద్ధతిలో నీవు చెయ్యి మొత్తంమీద అహంభావనకు food supply cut చెయ్యి. మన దేహం ఆహారం లేకుండా ఎలా ఉండలేదో అహంభావన దేహంలేకుండా ఉండలేదు. నీలో అహంభావన ఎంతకాలమయితే ఉందో అంతకాలం నీకు శరీరాలు వస్తూనే ఉంటాయి ఎందుచేతనంటే అది శరీరం లేకుండా ఉండలేదు. అహంభావనకోసం ఎవడైతే పనిచేస్తున్నాడో వాడికి మోక్షం సున్నా, బంధం తప్పదు. మనం మాట్లాడేమాట, చేసేపని ఈశ్వర ప్రీత్యర్థం చేయాలి. మన అహంకారమును అలంకరించుకొంటూ దానిని పోగొట్టుకోవాలి అని మనం చూస్తున్నాము. అది ఎలా పోతుంది. అహంకారమును అలంకరించుకోవటం ముందు మానివెయ్యి. కుండలో అన్నం ఉన్నా దానిపైన మూత ఉంటే మనకు కనబడదు. అలాగే నీహృదయంలో ఈశ్వరుడు ఉన్నా అహంకారము అనే మూత నీకు అడ్డుగా ఉంది. ఆమూతను తీసి ఒకప్రక్కకు పెట్టు నీహృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు తెలుస్తాడు.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 18-8-96)**